International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.4, Issue-10, October, 2017
Impact Factor: 6.023; Email: drtvramana@yahoo.co.in

# Nalluri Venkatrayudi Gari "Raithu Bharatam--Grameena jeevana Chitrana

# “నల్లూరి వెంకట్రాయుడి గారి రైతు భారతం - గ్రామీణ జీవన చిత్రణ”

Dr BUSI VENKATASWAMY,
HOD & Research Guide,
P A S College,
Pedanandipadu,GUNTUR,
Andhra Pradesh-522235

కవి, నటుడు, దర్శకుడు, గాయకుడు, ప్రయోక్త, విమర్శకులు, బహుభాషాకోవిదులైన శ్రీ నల్లూరి వెంకట్రాయుడుగారు 1943 సం॥లో ప్రకాశం జిల్లా కారంచేడు మండలం జరుబులవారిపాలెంలో సుభద్రమ్మ, కృష్ణయ్య దంపతులకు జన్మించారు. కారంచేడు, తిమ్మసముద్రం, బందరు, తిరుపతుల్లో విద్యాభ్యాసం చేసి ఉన్నత విద్యను పూర్తి చేసారు. “చింతలపూడి ఎర్రనార్యుని కృతులు – సమగ్ర పరిశీలన” అనే అంశంపై పరిశోధన చేసి సప్రమాణికమైన పరిశోధనా సిద్ధాంతాన్ని సమర్పించి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పట్టా పొందారు. మొదట చీరాల వి.యస్.ఆర్. & వై.అర్.యన్.కళాశాలలో తెలుగు అధ్యాపకులుగా పని చేసి ఆ తర్వాత 1968 సం॥ నుండి పదవీ విరమణ చేసే వరకు పెదనందిపాడు ఆర్ట్స్ & సైన్స్ కళాశాలలో రీడర్‌గా, శాఖాధ్యక్షులుగా, వైస్-ప్రిన్సిపాల్ వంటి హోదాలలో పని చేసి తాను చదివిన చదువుకు, వృత్తికి, ప్రవృత్తికి సార్ధకత చేకూర్చారు.

తండ్రి నుండి సంక్రమించిన లౌకిక ప్రజ్ఞ, వ్యవహార దక్షత, తల్లి నుండి అలవడిన పౌరాణిక ప్రజ్ఞ, ఆధ్యాత్మిక చింతన పెనవేసుకపోయి వెంకట్రాయుడి జీవితానికి పరమార్ధతను చేకూర్చిపెట్టాయి. ఆ పరమార్ధమే అనంతరం ఆయన జీవనానికి గీటురాయైనిలిచింది. ఉద్యోగరీత్యా పెదనందిపాడు చేరిన వెంకట్రాయుడి వ్యక్తిత్వం సహస్రదళ పద్మమై వికసించింది. బంధువులను, సోదరులను, పేద విద్యార్ధులను చేర దీసి వారికి విద్యాబుద్ధులు చెప్పటమేగాక ఆర్ధికంగా ఆదుకుంటూ వారికి ఆశ్రమం కల్పించి ఉన్నత స్ధాయిలో స్థిరపడేటట్లు చేసారు. వారి యిల్లు ఎందరో హితులు, సన్నిహితులు, నటులతో సాహిత్యగోష్ఠులకు, పద్య పఠనానికి, నాటక శిక్షణకు నిలయంగా ఉండేది. వారికి తగ్గట్లే వారి శ్రీమతి అతిధి సాత్కారాలకు అన్నపూర్ణయై నిలిచింది. ఇక కళాశాలలో జరిగే ఏ కార్యక్రంలోనైనా ఒక ప్రత్యేక ముద్ర కలిగి సహాచర అధ్యాపకులకు మార్గదర్శకులుగా గురు స్థానంలో ఉండి ముందుకు నడిపేవారు.

వెంకట్రాయుడుగారు బహుగ్రంథకర్త. ఆయన రచనలలో పద్య కావ్యాలదే పైచేయి. పుణ్యభూమి, వేదన–నివేదన, అగ్నిసీత, అగ్గిపూలు, రైతు భారతం, తారావళి, కచదేవయాని, ఓ సీతకథ, శివరామోదాహరణం వంటి పద్యకావ్యాలు, శ్రీరామ పట్టాభిషేకం, ప్రద్యుమ్న విజయం, మోహినీ విజయం, సమ్రాట్ సుయోధన, తిరుపతమ్మ కథ వంటి నాటకాలు రచించారు. మరాఠా భాష నుండి మనోధర్మ ప్రబోధామృతాన్ని తెలుగులోకి స్వేచ్ఛానువాదం చేసారు. అదే విధంగా సంస్కృత భాషలోని మయూరుని సూర్యశతక శ్లోకాలను సీస పద్య రూపంలో తెలుగు అనువాదం చేసారు. సూర్య శతక అనువాదం ఆయన ప్రజ్ఞకు, ధీశక్తికి కొలబద్ధగా నిలుస్తుంది. వెంకట్రాయుడి రచనల్లోకెల్లా ఉత్తమోత్తమైన రచన శ్రీరామ పట్టాభిషేకం నాటకం. ఆయనకు నాటకాలన్నా, నాటకాలలో నటించడమన్నా ఎంతో ఇష్టం. వెంకట్రాయుడుగారు శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, ధర్మరాజు, భీముడు, అశ్వద్ధామ, హరిశ్చంద్రుడు, నక్షత్రుడు, బిల్వమంగళుడు, భవానీ శంకరుడు వంటి వైవిధ్య భరితమైన పాత్రలు

పోషించి ఆయా పాత్రలకు జీవంపోసి రక్తి కట్టించారు. వీరు వృత్తి అధ్యాపనమైనా ప్రవృత్తి రచనా వ్యాసంగం. దాంతోపాటే నాటక కళకు సేవ చేయటం. అనేక సాంఘీక, పౌరాణిక నాటకాలలో నటించి మంచినటుడుగా, పద్య గాయకుడిగా కీర్తిని పొందారు. బహుభాషా కోవిదుడైన వెంకట్రాయుడు నిరంతర సాహిత్య అధ్యయనశీలి.

వెంకట్రాయుడు వ్రాసిన నాటకాలన్ని ఒక ఎత్తైతే, పద్యకావ్యాలది మరొకఎత్తు. పద్యకావ్యాలలో మెట్ట రైతుల జీవన కడగండ్లను, గ్రామీణ జీవితాన్ని ప్రభావితం చేసి అతలాకుతలం చేస్తున్న గ్రామ రాజకీయాల తీరును, కృషీవలుని మానసిక చిత్తవృత్తిని అద్భుతంగా ఆవిష్కరించిన పద్యకృతి రైతు భారతం.

**రైతు భారతం – ఇతివృత్త వైవిధ్యం :**

రైతు భారతాన్ని వెంకట్రాయుడుగారు సప్తఖండాలుగా విభజించి, వివరించిన తీరు చాలా హృద్యంగా ఉంది. ఏడు ఖండాలలో ఒక తరం నుండి మరో తరంలోకి ప్రవేశించిన రైతు జీవితాన్ని వివరించారు.

రైతు భారతం ఇతివృత్తాన్ని పరిశీలిస్తే పాకనాటి గ్రామంలో నరసింహుడనే రైతు వ్యవసాయాన్ని నమ్ముకొని గ్రామ ప్రజలందరికి తలలో నాలుకలా వ్యవహారిస్తూ జీవిస్తుంటాడు. అతనికెప్పుడు పంట పొలాలపైనే ధ్యాస. గ్రామ సౌభాగ్యాన్ని మించినదేదీ లేదంటాడు. గ్రామంలో ఏ చిన్న తగాదా జరిగినా అతడే న్యాయవాది. తాను ఇచ్చే తీర్పులకులోబడి గ్రామం నడిచేది. ఆయనకు తగ్గట్లే ఆయన భార్య నాగమాంబ నడుచుకునేది. వారి వరాల పంట రాముడు, హరి.

పెద్దవాడు రాముడు చక్కగా చదువుకోగా, చిన్నవాడు హరి చదువు అబ్బక తండ్రివలె వ్యవసాయంలో ప్రవేశిస్తాడు. హరి వ్యవసాయం చేయటంలో తండ్రికి తగ్గ కుమారుడనే పేరు సంపాదించాడు. గ్రామంలోగాని, ప్రక్క గ్రామాలలోగాని ఏ చిన్న పందెం జరిగినా అక్కడ హరి ప్రత్యక్షమై అందులో విజయం సాధించేవాడు. అతనికి ఎడ్ల పందాలంటే ఎంతో ఇష్టం. తన ఎడ్లతో బరిలోకి దిగితే అవతలవాని ఎడ్లు ఆమడ దూరం పరిగెట్టేవి. ఎన్నో బహుమతులు పొంది విజయగర్వంతో ఉండే అతన్ని, అతని ఎడ్లను చూడటానికి తీర్థాలను దర్శించేమాదిరి ప్రజలు ఆ గ్రామంవైపు పోటెత్తేవారు. యుక్తవయస్సు వచ్చిన వారిద్దరికి తండ్రి అత్యంత వైభవోపేతంగా పెండ్లి జరిపించాడు.

కాలం మారింది. వినాశకాలం వెంటాడి పట్టణ నాగరికత పల్లెలవైపు పాకింది. తత్ఫలితంగా స్వార్థం పడగలెత్తి బుసకొట్టింది. వడ్డీ వ్యాపారుల రంగ ప్రవేశం, కల్తీ వ్యాపారం రైతు జీవనాన్ని అతలాకుతలం చేసాయి. దీనికితోడు ప్రకృతి కన్నెర్రజేసి అకాల వర్షంతో రైతును నిట్టనిలువునా కూలేటట్లు చేసింది. గ్రామంలో అరాచక పరిస్థితులు తొంగిచూసాయి. రచ్చబండ వదిలి కోర్టుమెట్లు ఎక్కి రైతులు బికారులయ్యారు. ఎన్నికల కబంధ హస్తాలలో చిక్కిన గ్రామాలు రెండుగా చీలి కక్షలు, కార్పణ్యాలతో రగిలిపోయాయి. అన్నదమ్ముల మధ్య అడ్డుగోడలు నిలువ ముసలి తండ్రి గుండె ముక్కలయ్యింది. ఎన్నికల్లో గెలిచిన హరి సర్పంచ్ అయి అనేక అకృత్యాలకు పాల్పడ్డాడు. వ్యసనాలకు బానిసగా మారిన కొడుకు గూర్చి ముసలి తండ్రి తల్లడిల్లె. రాముడు జీవనోపాధికై పట్నం వెళ్ళిపోయాడు గ్రామ రాజకీయాలలో నలిగిన హరి ఉన్నదంతా పోగొట్టుకొని బికారిగా మారిపోయాడు. హరికి తండ్రి జ్ఞానోదయం కల్గించి సరైన దారిలోనడిపాడు.

ప్రకృతి భీభత్సం, వ్యాపారవేత్తల మోసాలు, వడ్డీ వ్యాపారుల ఆగడాలు, బ్యాంక్ ఋణాలు వెరసి రైతుల ఆత్మహత్యలకు దారితీసాయి. చలించిన హరి వారి కోసం సత్యాగ్రహాన్ని ఎన్నుకొన్నాడు. అతని వెంట రైతులు

నిలువ రైతు సమస్య రాజకీయ సమస్యగా మారిపోయింది. ఆగమేఘాల మీద మంత్రులు వచ్చి హామీల మాట ఇవ్వగా కాలక్రమంలో నోటిమాటగా మిగిలి పోయింది. ఈ సారి హరి రైతు ఉద్యమాన్ని ఉధృతంగా చేయగా భాష తెలియని సైనికులతో ప్రభుత్వం కాల్పులు జరిపించింది. ఎందరో రైతులు చనిపోగా వారిలో ముందుగా హరి ఉండె. పాకనాట ప్రారంభమైన రైతు ఉద్యమం దేశం అట్టుడికేటట్లు చేసింది. ప్రభుత్వం రైతు సంక్షేమమే ప్రధానమని సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టింది. రైతులు సంఘటితంగా ఉంటే దేనినైనా సాధించవచ్చని నిరూపణ చేసింది. ఇదే రైతు భారతం.

**రైతు భారతం – గ్రామీణ జీవన చిత్రణ :**

వెంకట్రటాయుడు గారు రైతు భారతం అని పేరు పెట్టి కథానాయకుడిగా రైతును చూపినప్పటికీ ఇందులో ఎన్నో సామాజికాంశాలను సృజించారు. ముఖ్యంగా ఒకప్పుడు పైరుపచ్చలతో కళకళలాడిన గ్రామ సీమల సౌందర్యం కలుషిత వాతావరణానికిగురై మసకబారిన వైనాన్ని, రైతుల జీవన స్థితిగతుల్ని, సాంఘీక జీవనంలో జరిగిన పెనుమార్పులను, ఎన్నికల సందర్భంగా వెల్లువెత్తిన కక్షలు కార్పణ్యాల వలన ఉమ్మడి కుటుంబాలు వ్యష్టి కుటుంబాలుగా మారిన స్థితిని, మానవీయత లోపించిన సమాజనీతిని, రైతుల ఆత్మహత్యల కంటే ఆత్మస్థైర్యం ప్రధానం అని చెప్పేటటు వంటి విషయాలనెన్నింటినో సామాజిక స్పృహతో సృజించారు.

**రైతు జీవితం – గ్రామ సౌభాగ్యం :**

రైతు భారతంలో ఒకప్పుడు గ్రామ సీమలు ఎలా ఉండేవో, ఎటువంటి సంఘ జీవనంతో అలరారుతూ ఉండేవో కళ్ళకు కట్టినట్లు దృశ్యీకరించారు.

"ఒక ప్రక్క వరిపైరులూయ్యాల లూగుచు
తన్వంగి హెూయలు సంధాన పఱుప
ఒకవైపు పూపిందె యొప్పుతో కంది ప
ట్టెలు భూసతికి హారములు రచింప
ఒకత్రేవ మేనెల్ల వికసించు పూలతో
కర్ణికారమ్ములు కళలు గులుక
ఒకవంక జొన్న సంకుకు వచ్చు పొంకాన
పొడవు కంకులతోడ పొలుపు నింప
ఒకట కొతిమేర, శనగలు, ఒక్క దరిని
అనుము, మినుముల లింకొక చక్కినరిగె వరిగె
ఒక్కపట్టున పచ్చ బీళ్ళొప్పు మీర
కనుల పండువు సేయును గ్రామ సీమ" --- అంటూ నేలంతా పచ్చని పందిళ్ళుగా మారి పెళ్ళి ఇంట కన్పించే ఆహ్లాదకర వాతావరణంతో పంట పొలాలతో సుగంధ పరిమళాలు వెదజల్లుతూ కనువిందు చేస్తూ కన్నుల పండుగగా ఉంటుందని వెల్లడించారు.

గ్రామాలలో ప్రత్తికి బదులు రైతులు పొగాకు వేసారు. ఆ క్రమంలో రైతుల ఇళ్ళలో బేర్నీలు వెలిసాయి. పొగాకును తాళ్ళతో గుర్రాలపై అల్లి బేర్నీలలో పెట్టడానికి ఎక్కడెక్కడ నుండో వలస వచ్చిన ప్రజలు పందిళ్ళలో కూర్చొని ఆడవాళ్ళు పొగాకును గుప్పిళ్ళ ద్వారా అందిస్తుంటే యువకులు గుర్రాలపై వాటిని అల్లుతుంటారు. వారు తమ శారీరక శ్రమను మర్చిపోవటానికి జానపదగీతాలు ఆలపిస్తూ, మధ్యమధ్యలో చతురోక్తి, సరస సంభాషణలు కొనసాగిస్తూ చేసే పనిని గూర్చి కవి

మెరుపు తీవలవోలె మెరసి కళ్ళలనల్లు
యువకిశోరాలచే యొదుపునేర్పు
త్వరపెట్టు మగలకు వరుస గుప్పిళ్ళిచ్చు
ఒడుపులో జవ్వాదు నడుము సొంపు
మగలతోపాటుగా మగనాండ్రు గొంతులో
పల్లవించెదు జానపదము తీపి
తనముందు మునుము ముందర ముగిసిన చెల
రేగు మగువలకేరింత నగువు

ఓదెలెత్తు పొంకాన ప్రియుల వలగొను
వాలుచూపులు చతురోక్తి పాటవములు
సంతతానంద సన్నాహసంభృతంబు
సహృదయ హృదయావర్జక సాధనమ్ము" --- అంటూ వారి జీవనంలో ఎత్తుపల్లాలను దర్శిస్తూ వారు ఎటువంటి ఆహ్లాదకర పరిస్థితులలో పని చేసుకుంటూ శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేనేలేదంటూ సమైక్యతా రాగంతో ప్రవర్తించే విధానాన్ని వెల్లడి చేసారు.

## రైతు వ్యక్తిత్వం :

ఈ కావ్యంలో రైతు కథానాయకుడు. గ్రామ సీమ రంగస్థలం. గ్రామ సీమలే దేశానికి పట్టుగొమ్మలు. అటువంటి సీమల్లో కర్షకుని స్థానం ఉన్నతమైంది. ఎండనక వాననక నిరంతరం శ్రమిస్తూ రెక్కలు ముక్కలు చేసుకొని దుక్కిదున్ని ఎన్నో ఈతబాధలకోర్చి నీతి దప్పక లోకరీతిని నడిచే రైతు గూర్చి

"ఆత్మ విశ్వాసమే తనకండగాగ
తనకు వ్యవసాయమే ఊపిరనగనిలిచి
ఎపుడు వెనుకంజవేయుటే యెరుగరాక
క్షేత్ర లక్ష్మిని ప్రేమించు రైతు రాజు" --- అంటూ రైతు వ్యక్తిత్వాన్ని వివరిస్తారు. రైతు కేవలం తాను బ్రతికితే సరిపోతుందనుకోడు. తన చుట్టూ ఉన్న సమాజం తిన్న తర్వాతే తాను భుజిస్తాడంటాడు. ఇంటికి వచ్చే అభాగ్యులకు తృప్తి చెందే విధంగా చేయటంలో రైతును మించినవారు లేరంటూ

"ఆది భిక్షువునకు గూడ ఆర్తిదీర
భిక్ష పెట్ట గలుగు కర్మవీరుడతను
లోక కల్యాణ గతికి ప్రతీకగాగ
క్షితినెసగు సత్య ధర్మ దీక్షితుడతండు" --- అంటూ అతని దాతృత్వాన్ని సత్యధర్మ దీక్షా పద్ధతిని తెలియజేస్తాడు.

**లౌకిక ప్రజ్ఞ – వ్యవహార దక్షత :**

రైతేరాజు అనేనానుడి మనకు తెలిసిందే. గ్రామంలో రైతు నడిచేనడకలో రాజఠీవి రాజ్యమేలుతుంది. అతడు తలపాగా ధరించి, ముల్లుగర్ర చేతబట్టి, కొనచెంగు చేతబట్టి వస్తుంటే ఎటువంటి వారైనా వినమ్రతతోపైకి లెగవాల్సిందే, చేతులెత్తి మొక్కవలసిందే. అతడు గ్రామంలో తలలో నాలుకలా వ్యవహరిస్తూ ధర్మపరిపాలనకు పూనుకుంటాడు. బుద్ధదేవునికి బోధ వృక్షం వద్ద జ్ఞానోదయమైనట్లే అజ్ఞాన తిమిరాంధకారంతో కొట్టుమిట్టాడే ప్రజల కనువిప్పు కలిగించడానికి రైతు ఏర్పరచుకున్న అత్యున్నత సింహాసనమే రచ్చబండ. ఎటువంటి వాదవివాదాలైన పరిష్కరించగలిగే లౌకిక ప్రజ్ఞ రైతు సొంతం. ఎంతో వ్యవహార దక్షత గల్గిన రైతు మాటకు తీర్పుకు ఎదురు చెప్పే శక్తిలేదని

ఊరి నడిబొడ్డు కొలువైన యూడమఱ్ఱి
దిగువ నెలకొన్న నల్లరాదిన్నె కనగ
బుద్ధ దేవుండు మేల్కొన్న బోధితరువు
అమలినమ్మైన ధర్మ సింహాసనమ్ము
ఏ వివాదమేనిట దీరు నిది స్థలంబు
మహిమయో నారయార్యుని మహితధీవి
భవమొ ఎంతవారు నెదురు పలుకబోరు
వత్తురూరూరి వారు వాదమున్న" --- అంటూ రైతుకు ఏ మాత్రం చదువు లేక పోయినా లోకజ్ఞతతో వ్యవహారశైలితో కార్యాన్ని నెరవేర్చ గల సమర్ధుడని తెలియజేస్తాడు.

**కాలం మారుట – గతులు తప్పుట :**

అన్ని రోజులు ఒకేలా ఉండవు. తరాలు మారేకొద్దీ అంతరాలు పెరిగి పోయాయి. ప్రజలలో స్వార్ధ చింతన పెరిగి ధర్మాలు ప్రక్కకు నెట్టి వేయబడ్డాయి. నీతి నియమాలు గాలికి ఒదిలి ధర్మాధర్మ విచక్షణ మరచి యువత ప్రవర్తిస్తున్న తీరును కవి తూర్పారబడుతూ

" చెడ్డ మదికెక్కి నంతగా చేరదొండు
స్వల్ప లాభమ్ములాశించు నల్పబుద్ధి
అభిజాత్యమ్ము మఱచు మోహాత్మకుండు
యౌవనోద్రేక మార్జనమ్మడగద్రొక్కు"

International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.4, Issue-10, October, 2017
Impact Factor: 6.023; Email: drtvramana@yahoo.co.in

ఐహిక భోగ సమాదరంబధికమై
జాతి నీతులరీతి జారద్రొక్క
గురుకులంబన్నను కొండిక భావమ్ము
ప్రబలగా వినయమ్ము ప్రక్కనక్కె
ప్రాత పురాణముల్ పనికిరావని యెంచ
దైవభీతి యపరధామ మెక్కె
చిత్రభామలజూచి చిత్తమ్ములుదు కెక్క
ధర్మ చింతకు నిరాదరము దక్కె

నాయకుల బేధవాదముల్ నాటుమతుల
ఐక్యభావ మెడలి శాంతి నడగ ద్రొక్కె
దిక్కుదెసమాలు స్థితులలో తెలివి దక్కి
యువత పంచ బంగాళమై యొప్పుదరిగె" --- అని నేటి యువత ప్రవర్తిస్తున్న తీరును, దైవ భీతి లేక వ్యవహరిస్తున్న వైనాన్ని ఎండగట్టారు.

**పల్లెలకు పాకిన పట్టణ నాగరికత :**

కాలగర్భంలో ఓడలే బండ్లు, బండ్లే ఓడలు అయ్యే పరిస్థిలు దాపురించాయి. వినాశకాలం వెంటాడి పట్టణ నాగరికత పల్లెలకుపాకింది. స్వార్ధంతో మనిషి జీవన విధానమే మారిపోయింది. శాంతి, సమాధానం కురువై కక్ష్యలు కార్పణ్యాలు పెరిగిపోయాయని కవి ఆవేదన చెందుతూ

నగర వాతావరణము పల్లెలకు ప్రాక
మాధురీ మహిమమ్ము మట్టి గలసె
యంత్ర భూతమ్ములు వ్యవసాయ పథమెక్క
అలసరక్కసుడు రాజ్యమ్ము చేసె
పాలేళ్ళ పనిమాన పశుగణమ్ముల మీద
మక్కువ దెసమాలి బిక్కచచ్చె
పక్షాలుగా చీలి కక్షమై ప్రజలుండ
అదిరిపాటన శాంతియుటక లెక్క

సహజ సద్గుణ పుంజమ్ము సరసబాపె
దుర్విషయ విషనాగముల్ దుదుకు చూపె
కాపుకులగౌరవమ్మిర కాటపడియె
నగర నాగరికత తెగి పల్లెలకు" --- ప్రాకి చివరకు అన్నదమ్ముల మధ్య అడ్డుగోడలు ఏర్పాటు చేసిందని, స్నేహసౌరభాలు చెల్లా చెదరై కులమత్తు పంజావిసిరి పెనుగాలై గ్రామ ప్రజలను చెల్లాచెదురు చేసి విరోధవృత్తిని పెంచిందని ఆవేదన చెందారు.

**గ్రామ కక్షలు – కోర్టు కేసులు ః**

ఒకప్పుడు గ్రామంలో శాంతి సౌఖ్యం వెల్లివిరియటానికి రైతు ప్రధాన భూమిక పోషిస్తే ఎన్నికలు వచ్చి దానిని పటాపంటలు చేసింది. కుళ్ళుకారు పెత్తనం కోసం వివేచన మరచి గొడవలకు వెళ్ళి రచ్చబండ వదిలి కోర్టు మెట్ల చుట్టూ తిరుగుతూ ఉన్న ఆస్థిని ఊడబెరుక్కున్నాడు. ఎన్నికల ఫలితంగా ఒకే తల్లి గర్భాన జన్మించిన అన్నదమ్ముల మధ్య మనస్పర్ధలు పెరిగి రెండు వర్గాలుగా చీలి గ్రామాన్ని కదనరంగంగా మలచి మానవీయతను మర్చిపోయారంటూ

“ అన్నదమ్ముల వాత్సల్య మఱయనీదు
తల్లిదండ్రియన్న మమత దలపనీదు
చుట్ట పక్కాల నెనరును చూడనీదు
స్వార్ధ చిత్తమ్ము మానవీయత హరించె ”

“ మంచి చెడులు చెప్పి మన్ననల్ గైకొన్న
పెద్దతికము గూడ చిన్నబోయె
కొడుకుమాట వినక కొంపలు రెండైన
ముసలి తండ్రి గుండె ముక్కలయ్యె ” --- అంటూ వాళ్ళు ఏ విధంగా ప్రవర్తిస్తున్నారో, తల్లిదండ్రులకు ఎంతటి శోకానికి గురి చేస్తున్నారో, ఉమ్మడి కుటుంబాలు వ్యష్టి కుటుంబాలుగా మారటానికి ఎన్నికలు ఏ విధంగా తమ వంతు పాత్ర పోషించాయో, పచ్చ గడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు గ్రామసీమకి ఎలా ప్రవేశించాయో చాలా చక్కగా వర్ణించారు.

**వడ్డీ వ్యాపారుల దురాగతాలు – రైతుల దుస్థితి ః**

గ్రామాలలో ఒకవైపు ప్రకృతి వైపరీత్యం రైతును నిలువెల్లా దహిస్తుంటే మరొకవైపు వ్యాపారులు రైతు జీవితంతో ఆటలాడుకుంటున్నారు. పంట పండక ఉన్నదంతా ఊడ్చి అప్పుసప్పు చేసి వ్యవసాయం మీద పెడితే రైతుకు మిగిలేది శూన్యమే. రైతు బతకలేక బతుకుతున్నదుస్థితిని

“ తెల్ల బంగారమిది సిరిదెచ్చునంచు
పుస్తెతాకట్టుపై తెచ్చి పోసియుంటి
కన్నుగానని కాటుక నెన్నుకొంటి
కల్గినది యెల్లపోయి పోకాలు చుంటి.

ప్రత్తి పండించుటన్న వ్యాపారమయ్యె
పెట్టుబడిలేక పండదు పెసరగూడ
పుట్టుదలలేక యన్నింట పుట్టి మునుగ
బ్రతుకు చచ్చియు చావక బ్రతుకు చుంటి” --- ఈ విధంగా బతికే రైతుపై మూలిగేనక్కపై తాటికాయపడ్డట్లు వడ్డీ వ్యాపారులు చక్రవడ్డీలు వడ్డించి ఏ విధంగా రైతులను బికారీలుగా మారుస్తున్నారో తెలియజేస్తూ

" ఏడు గడచుకొలది యీగతి దిగజార్చి
పరువుదీసె బిచ్చపాప తేదు
వడ్డీ మీద వడ్డి పలుమారు వడ్డించి
బిచ్చగాని చేసి విడిచి పెట్టె " --- నని వారి దురాగతాన్ని ఎండగట్టారు.

**రైతు దీనస్థితి – ఆత్మహత్యలు :**

ప్రకృతి భీభత్సం, వ్యాపారుల మోసాలు వెరసి రైతులు నిలువెల్లా ముంచితే తల్లిడిల్లిన రైతు ఆత్మాభిమానంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనల్ని

" ఏటేట నష్టాలు ఊటలుప్పొంగి
తాటాకు మంటగా ధర్మ మడంగ
పేక మేడల నెల్ల పృధివి కూలంగ
మిక్కుటమ్మౌ బాకి వెక్కిరింపంగ
నిల్లలేకను రైతు నిబ్బరమ్మడగ
ఆత్మాహుతి కళంక మంట గట్టుకొని" --- అణగారి పోయారని కవి ఆవేధనా భరిత కంఠంతో ఆక్రోశిస్తారు.

**రైతు ఉద్యమం – సంక్షేమ పథకాలు :**

తండ్రి నుండి జ్ఞానోదయం పొందిన హరి రైతుల ఆత్మహత్యలను నిలువరించడానికి కంకణం కట్టుకొని సత్యాగ్రహ దీక్షకు పూనుకుంటాడు. అన్నదాతల ఆర్తరావాలకు భయపడ్డ మంత్రి వర్గం అరచేతిలో స్వర్గాన్ని చూపి హామీలు గుప్పించి అవతలకు వెళ్ళిపోగా మరలా రైతులు ఉద్యమాన్ని ఉధృతం చేస్తారు. తత్ఫలితంగా ప్రభుత్వం కాల్పులు జరపటం ఎంతో మంది అమాయక రైతులు చనిపోవడం, ఎంత అమానుషమో వివరుస్తూ ఈ ఘోరకృత్యాలు చూడలేక సూర్యుడు సైతం ప్రక్కకు తప్పుకుంటే మనుషులకు మానవీయత లేకుండా పోయిందని కవి వాపోతూ

" ఇట్టి ఘోరంబు గాంచక నిష్టపడక
భానుడపరాద్రి శిఖరంబు ప్రక్కకేగె
రశ్మి రోషించె పూనె నెత్తురందనమ్ము
పుడమి హృదయమ్ము పగులకెంపును వహించె" నని వాపోతారు. కొడుకు మరణంతో గుండెలవిసిన తండ్రి కుమారుని దేహం వద్ద విలపిస్తున్న తీరును కవి

" గుండ్లు తగిలిన క్షణములో కుప్పగూలి
ఎంతగా తన్నుకొంటివో యెఱుగ తనయ
శుచికి శుభ్రమ్మునకు శ్రద్ధ చూపు నీవు
ధూళిలో నెట్లు పడియుండ జాలితకట " --- అంటూ విలపిస్తున్న స్థితిని కవి హృదయ విదారకంగా వర్ణించారు. చివరకు ప్రభుత్వం సంక్షేమ పథకాలతో రైతులను శాంతింపజేసిందని తెలియజేస్తూ

" జరిగె మారణమ్ము పెరిగె పట్టుదలయు
గుండె గుబులుకొనగ గొంకె ప్రభుత
చేరువయ్యె కొంత చేసె కొన్ని పనులు
శాంతినొందె రైతు సాధుమూర్తి " --- అంటూ రైతు శాంతి పొందితేనే సౌఖ్యం వెల్లి విరిస్తుందని తెలియజేస్తాడు. రైతులు తమ ప్రాణాలను అర్పిస్తేగాని ప్రభుత్వానికి చలనం రాలేదని కవి నిర్వేదంతో పలుకుతూ రైతు కంట తడి తుడవటానికన్నట్లు ప్రభుత్వం సంక్షేమ పథకాల సాకుతో తప్పించుకుందని దానికి రైతు తృప్తిపడి శాంతినొందాడని వెల్లడిస్తాడు.

**ముగింపు :**

రైతు భారతం ప్రతి గ్రామంలో జరిగిన, జరుగుతున్న సంఘటనల సమూహారంగా రచించబడింది. ఇందులో కవి ప్రయోగించిన పద ప్రయోగాలు, వాడిన భాష సరళ సుందరశైలిలో ఉండి పాఠకులకు సులభరీతిలో సుబోధకంగా అర్థమవుతుంది. రైతు సంఘటితంగా ఉంటే దేనినైనా సాధించుకోవచ్చని, నిరాశనస్పృహలకు గురి కాకుండా ఎదురైన సమస్యను ధైర్యంగా ఎదుర్కోవాలని, జీవితంలో ఓడిపోయి ఆత్మహత్యలే శరణ్యం అనుకునే వారికి రైతు భారతం ఆత్మ స్థైర్యాన్ని ప్రబోధిస్తుందని చెప్పవచ్చు. గ్రామ సీమల సౌభాగ్యమే దేశ సౌభాగ్యమని కక్షలు కార్పణ్యాలు వదలి ఉమ్మడి కుటుంబాలతో జీవించవలసిన పరిస్థితిని మానవీయ కోణంలో కవి ఆవిష్కరించారు. వారి ఆలోచనా విధానం సర్వకాలాలలో సార్వ జనీనకమై నిలిచి తెలుగు సాహితీ చరిత్రలో కర్షక సాహిత్య అంతర్భాగమై నిలుస్తుందనుటలో ఎటువంటి సందేహం లేదు.